# డాలీ



డాడీ మంచి డాడీ.

కావి కొడతాడెందుకు?

తప్పు చేస్తే కొడతాను అంటాడు. తప్పు చేయక పోయినా కొడతాడు ఎందుకు

చెందూతో ఆడుకుంటే కొడతాడు: వాళ్ళింటి కెళ్ళినా కొడతాడు. మమ్మీకి తమ్ముడున్నాడు కదా. అంటే నాకు మామయ్య వాళ్ళబ్బాయి. చెందూ. అత్తయ్య చాలా మంచిది. నాకెప్పుడు స్వీట్స్ ఇస్తుంది. అయినా వాళ్ళింటికెళ్తే డాడీ కొడతాడు.



దూరమేం కాదు. ఎదురిల్లే. వెళ్ళ కూడదు.

వద్దన్నా వెళ్ళామ ఒకసారి. బెల్టు తీసి కొట్టాడు. వీపు మీద వాతలు. మమ్మీ ఏడ్చింది.

మమ్మీ డాడీ తిట్టుకున్నారు.

ఏంటో మాటలు. ఆస్తులు, కట్నం, బిల్డింగులు, పొలాలు, ఏంటో గొడవలు.

ఆ ఇంటికెళ్తే మళ్ళీ రానివ్వమ అంటాడు డాడీ.

మమ్మీ ఏడుస్తుంది. నన్ను పట్టుకుని ఏడుస్తుంది. ముక్కు చీది ఏడుస్తుంది. మంచి మమ్మీ. అయితే మమ్మీ కళ్ళు తమాషాగా ఉంటాయి. ఎటు చూస్తుందో తెలీదు. మెల్ల కళ్ళు అంటారు. మమ్మీ నల్లగా ఉంటుంది. మంచి మమ్మీ.

మమ్మీని నేమ కొడతామ. తిడతామ. అన్నం పెడితే కంచం విసిరి కొడతామ. మమ్మీని తన్నెయ్‌రా చింటూ అంటాడు డాడీ. ఎందుకలా అంటాడో.

మమ్మీ పోతే వేరే మమ్మీ వస్తుంది అంటాడు.

పోతే... అంటే మమ్మీ ఎక్కడికి పోతుంది?

అమ్మమ్మ వాళ్ళింటికి పోదు కదా డాడీ పోవద్దన్నాడు కదా.

మరి మమ్మీ ఎక్కడికి పోతుంది.

వేరే మమ్మీ ఎట్లా వస్తుంది! ఎందుకు వస్తుంది!

అది మాత్రం చెప్పడు డాడీ.

కాని డాడీ బాగా నవ్వుతాడు. దర్జాగా ఉంటాడు. నాకు ఏం కావాలన్నీ కొని పెడతాడు. కాని కొడతాడే. అదే బాగుండదు. వీపు మీద కొడతాడు. చేతి మీద భుజం మీద కొడతాడు. చేత్తోనే కొడతాడు. బ్యాడ్ డాడీ అని పిస్తాడు. కాని మళ్ళీ చెప్తాడు. అన్నీ నాకోసమే అంటాడు. పాపం మంచి డాడీ!... ...

కొత్తగా పిన్ని వచ్చింది. పిన్నితో పాటు బాబాయ్ వాళ్ళతోటే డాలీ. అంటే వాళ్ళ పాప. ఇంకా మాటలు రావు.

పిన్నీ బాబాయ్ లవ్ మారేజ్ అట. అంటే తెలీదు. తాతయ్యతో పోట్లాట. ఇంతకు ముందు వేరే కాలనీలో ఉన్నారు.

ఇప్పుడు ఇక్కడికొచ్చేశారు. మా ఇంటి మేడ మీదికి. డాడీయే వాళ్ళకు ఇల్లి చ్చాడు. అంటే అద్దెకు అన్నమాట.

డాలీ బావుంటుంది. బొమ్మలా వుంటుంది.

నేమ ఆడుకుంటామ. చెందూ కూడా ఆడుకుంటాడు.

పెద్ద వాళ్ళు ఏమేంటో మాట్లాడు కుంటారు.

ఒకరిద్దర ఇంకోర్ని తిట్టుకుంటారు.

మళ్ళీ ఎదుట పడితే నవ్వుతారు. తియ్యగా మాట్లాడతారు.

డాడీ మామయ్యని తిట్టుకుంటాడు. మమ్మీ అమ్మమ్మను తిట్టుకుంటుంది. మామయ్య డాడీని తిట్టుకుంటాడు.

అయితే అందరూ పైకి బాగానే నవ్వుతూ మాట్లాడుకుంటారు. అంతే పెద్దవాళ్ళు.

ఒకరి ఇంటికి ఇంకొకరు పోతారు. వస్తారు.

నేమ మాత్రం చెందూ దగ్గరికి పోకూడదు. మామయ్యతో మాట్లాడకూడదు. అత్తయ్యతో తమాషా చెయ్యకూడదు.

అట్లా చేస్తే డాడీ కొడతాడు.

మమ్మీతో చెప్తే డాడీ వద్దన్నాడు కదా అంటుంది. పిచ్చి మమ్మీ. ఎవరేం తిట్టినా ఏడుస్తుంది. అంతే...

డాడీ మాబాయ్ మంచి ఫ్రెండ్సు అన్నమాట. ఏమేమో మాట్లాడుకుం టారు. మనకి తెలీదు. నన్ను బాబాయ్ ఇంటికి మాత్రం వెళ్ళమంటాడు డాడీ. చెందూ కూడా అక్కడికొస్తే అప్పుడు వాడితో ఆడుకుంటామ నేమ. చెందూ అంటే నా కిష్టం. బామర్ది అంటాడు. తమాషాగా ఉంటాడు.

జోక్స్ చెప్తాడు.

బాబాయ్ ఇంటికి డాడీ కూడా

వస్తాడు.

పిన్నీతో బాబాయ్‌తో ఏమేమో మాట్లాడతాడు.

మనకి తెలీదు. ఇల్లు, డబ్బు, ఉద్యోగాలు, ఏమేంటో అవి. మనకేం తెలుసు

డాలీ నడుస్తుంది. నేను నడిపిస్తాను. ఆడిస్తాను. అది భలే నవ్వుతుంది. అది ఏం చేసినా అందరికీ ఇష్టం.

ఒకసారి డాడీ దాన్ని ఎత్తుకుంటే ఉచ్చ పోసింది. అలా అనకూడదు కదా పాస్ పోసింది.

డాడీ నవ్వేవాడు. పిన్ని వచ్చి డాలీని ఎత్తుకుంది. టేబుల్ దగ్గర నీళ్ళు ఒలికితే తిడతాడు డాడీ. డాలీ ప్యాస్ పోసినా ఎందుకు తిట్టడు?

మమ్మీ నల్లగా ఉంటుంది కాని పిన్ని తెల్లగా ఉంటుంది. పిన్ని సన్నగా ఉంటుంది. ముక్కు పుడక బావుంటుంది.

పిన్ని నవ్వితే ఇంకా బావుంటుంది.

డాడీ ఒకసారి సీక్రెట్‌గా అడిగాడులే.

అవును. మమ్మీ కన్నా పిన్ని బావుంటుంది. అయితే మమ్మీ నన్ను చూసి ఒక మాదిరిగా తయారవుతుంది.

అట్లా ఎవ్వరూ చూడలేరు.

మమ్మీ అంటే ఇష్టం నాకు. అంటే ఇష్టంలో వేరే ఇష్టం.

ఇష్టంలో అయితే మమ్మీయే బావుంటుంది.

పిన్ని నాకెందుకు బావుంటుంది?

డాడీని నేనంటే కోపమా?

ఏమోనాకే తెలీదు. నేనేం తప్పు చెయ్యలేదు.

డాడీకి ఇపుడు డాలీ అంటే ఇష్టం.

ఎక్కువ ఇష్టమై పోయింది.

మేడపై కెళ్తాడు. దాంతో ఆడుకుంటాడు. ఎత్తుకుంటాడు. ముద్దు పెట్టుకుంటాడు. గాల్లోకి ఎగరేసి పట్టుకుంటాడు.

నా కన్నా డాలీ అంటేనే ఇష్టమా!

నేను డాడీ కొడుకు. డాలీ పిన్ని కూతురు కదా! • అదంతా ఎక్కువ ఇష్టం ఇందుకు?

మేడ మీద నుంచి డాలీని ఎత్తుకొచ్చేశాడు డాడీ. వద్దు పిన్ని అలుగుతుంది అంది మమ్మీ. డాడీ వినలేదు. మా డాలీ, మంచి డాలీ అంటూ ముద్దు చేశాడు. కొంచెం సేపటికి పిన్ని వచ్చింది. డాలీని తీసుకుపోయింది. ఇవ్వనన్నాడు. డాలీ. లాక్కుంది పిన్ని. అట్లా ఎందుకు?

నన్ను ఎప్పుడు అట్లా ఎత్తుకోలేదే డాడీ!

మమ్మీ ఎప్పుడూ లాక్కోలేదే.

నాకేంటో అర్థం కాదు. ఏమీ తెలీదు.

అయితే నాక్కూడా తెలుస్తుందిలే.

డాలీని ఎత్తుకున్నపుడు డాడీ గమ్మత్తుగా ఉంటాడు. తమాషాగా నవ్వుతాడు. ఓరగా చూస్తాడు.

ఎటు చూస్తాడంటే. పిన్నివైపు చూస్తాడు. ఎందుకు చూస్తాడో గాని.

పిన్ని చూస్తున్నప్పుడు డాలీని ఎక్కువ ముద్దు చేస్తాడు. పిన్ని నవ్వదు. డాలీని ఇమ్మంటుంది. డాడీ ఇవ్వరు. పిన్ని చేతులు చాస్తుంది. డాడీ వెనక్కి పోతాడు డాలీని ఇవ్వడు. ప్లీజ్ ప్లీజ్ అంటుంది పిన్ని. డాడీ నవ్వుతాడు. అదేంటో అప్పుడు డాడీ బావుండడు. పిచ్చాడిలా వుంటాడు. పిన్ని డాలీని లాక్కుంటుంది. చేతులు తగుల్తాయి. డాడీకి అప్పుడు సంతోషం. పకపకా నవ్వుతాడు. ఎందుకట్లా నవ్వుతాడు? మనకి తెలీదు. అంతే మెల్లిగా తెలుస్తుందిలే...

డాడీ డాలీతో ఆడుకుంటాడు. చెండూ డాలీతో ఆడుకుంటాడు. పిన్నీ బాబాయ్ చెండూతో ఆడుకుంటారు. తమాషా చేస్తారు. అత్తయ్య మామయ్య డాలీతో ఆడుకుంటారు.

నేనుమాత్రం చెండుతో ఆడుకోకూడదు.

పిన్ని వద్దన్నా డాలీని డాడీ లాక్కుని తెచ్చుకుంటాడు.

గట్టిగా నలిపేస్తాడు. ముద్దు పెట్టుకుంటాడు. మీసాలు గుచ్చుకుంటాయి. డాలీ ఏడుస్తుంది. పిన్ని ఏడుపు మొహం పెడ్తుంది. అడిగినా ఇవ్వడు డాడీ. డాలీని ఎగరేసి పట్టుకుంటాడు.

మమ్మీ లేనప్పుడు డాడీ ఇంకా తమాషా చేస్తాడు. డాలీని మేడమీద నుంచి తెస్తాడు. అది ఏడుస్తుంటే డాడీ ఎట్లా నవ్వుతాడు?

పిన్ని వస్తే ఇంకా తమాషా చేస్తాడు.

డాలీని ఎత్తుకుని ఇల్లంతా తిరుగుతాడు. వంటింట్లోకి పోతాడు. బెడ్ రూంలోకి పోతాడు. పకపకా నవ్వుతాడు. పిచ్చాడేమో అనిపిస్తుంది.

డాలీ ఏడుస్తుంది. పిన్ని కోపంగా చూస్తుంది. డాలీని ఇవ్వమని గొడవ పెడుతుంది.

చాలాసేపు గొడవ.

డాలీని లాక్కుంటుంది పిన్ని. పైట జారిపోతుంది. పిన్ని భయపడుతుంది. డాలీతో వెళ్ళిపోతుంది.

డాడీ డల్ అయిపోతాడు. చాలా సేపు ఏమీ మాట్లాడడు. మనకేం తెలుస్తుంది.?

అప్పుడేమైందంటే... ఎక్కడో ఫంక్షన్ అన్న మాట. పార్టీ అన్నమాట. పెద్ద వాళ్ళంతా వెళ్ళారు. ఆయా లోన ఉంది. నేను బాల్ ఆడుతుంటే చెండూ వచ్చాడు.

ఇద్దరూ బాల్ ఆడుకున్నాం. దొంగ పోలీసు ఆడుకుంటుంటే డాడీ వచ్చేశాడు. వచ్చేసి నన్ను కొట్టేశాడు.

వీపు మీద దబీదబీ. అరిచాను. మమ్మీ రాలేదు. కోపమొచ్చేసింది.

ఒరేయ్ డాడీ ఎందుకురా కొడ్తావ్? నువ్వు డాలీతో ఆడుకోవచ్చు గాని నేను చెండుతూ ఆడుకుంటే తప్పా? చిన్న పిల్లాణ్ణి కాబట్టి నన్ను కొడ్తున్నావ్. నేను నీలా పెద్దాణ్ణి అయితే నిన్ను తన్నేస్తారా స్కౌండ్రల్ అని అరిచేశాను.

కోపమొస్తే డాడీని ఒక డాడీ అంటాలే.

నేను తిట్టేసరికి డాడీకి ఇంకా కోపం వచ్చేసింది. రాస్కెల్ నన్ను తిడతావా! ఈడియట్! అంటూ ఇంకా కొట్టాడు.

వీపు పగిలిపోతుంటే ఎంత నొప్పి కదూ!

నొప్పి ఎక్కువయింది కదా కోపం కూడా ఎక్కువై పోయింది.

ఒక డాడీ... నువ్వు డాలీతో ఎందుకు ఆడుకుంటావో తెల్సులేరా! అని అరిచాను.

ఎందుకేంట్రా రాస్కెల్! అని డాడీ ఉరిమేశాడు.

ఎందుకంటే పిన్ని బావుంటుంది. మమ్మీ కన్నా బావుంటుంది. అందుకని పిన్నిని మంచి చేసుకోవాలని డాలీని ముద్దు చేస్తావు నువ్వు. పిన్నితో డ్యూయెట్ పాడాలని కదురా నువ్వు. అని గట్టిగా అరుస్తుంటే..

పిచ్చిపిచ్చిగా డాడీ నన్ను కొట్టేశాడు. అప్పుడు నాకు నొప్పిగా వున్నా సంతోషంగా అనిపించింది. ఏడవలేదు.

తిరిగి చూస్తే గుమ్మంలో మమ్మీ పిన్నీ, బాబాయ్ నిలబడ్డారు.

అందరూ గుడ్లురిమి చూస్తున్నారు..

తర్వాత పిన్నీ, బాబాయ్... బాబాయ్ డాడీ... మమ్మీ పిన్నీ... డాడీ మమ్మీ... ఏంటేంటో అరుచుకున్నారు. అర్థమైంది గాని అదంతా మనకెందుకులే.

తర్వాత పిన్నీ, డాలీ మా ఇంటికెప్పుడూ రాలేదు. డాడీ నన్నెప్పుడూ కొట్టలేదు.

నిద్రలో మమ్మీ నన్ను గట్టిగా పట్టుకుని బంగారు మా బంగారు అంటుంది.

ఎందుకో తెలీదు. అంతే... అదంతేలే. మమ్మీ అంటే అంతే... ◆











కె. వర్ష